


ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


నాదెండ్ల: గణపవరం కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి జరిగిన కోలాటం ఆకట్టుకుంది. మాస్టర్ వెంకటరెడ్డిని సత్కరించారు.



బగళాముఖికి విశేష పూజలు

చందోలు(కర్లపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి పసుపు, కుంకుమలు సమర్పించారు.

ఘనంగా తిరునాళ్ల మహోత్సవం



నగరం: మండలంలోని ఈదుపల్లి గ్రామదేవత ఈదులమ్మ వారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం అమ్మ వారిని ఆలయంలో పునఃప్రవేశపెట్టారు.

న్యూస్‌రీల్

వృద్ధులకు న్యాయ సహాయం అందిస్తాం

న్యాయమూర్తి లావణ్య



నరసరావుపేట ఈస్ట్: వేధింపులకు గురవుతున్న వయో వృద్ధుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య తెలిపారు. ప్రపంచ వయో వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని ఆదివారం పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వయో వృద్ధులపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధుల రక్షణకు చట్టం కల్పిస్తున్న సౌలభ్యాలను వివరించారు. సమావేశంలో పాల్గొన్న న్యాయసేవాధికారులు మాట్లాడుతూ వృద్ధుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే తగిన న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నలుగురు వృద్ధులు తమ సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జి.చంద్రపాల్, కార్యదర్శి ఆర్.రామసుబ్బారావు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మవద్దు

ఆర్డీ డాక్టర్ సుచిత్ర

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి జూన్‌లో జరగనున్న సాధారణ బదిలీలను అత్యంత పారదర్శంగా, అవకతవలకు తావు లేకుండా నిర్వహిస్తామని గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ కె.సుచిత్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుకార్లు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. అవకతవకలకు పాల్పడే వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు అభ్యంతరాలు, ఫిర్యాదులను గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో స్వయంగా తెలియజేస్తే, విచారించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో అనకాపల్లికి చెందిన శ్రీవెంకట సాయి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శిరీష పర్యవేక్షణలో 24 మంది చిన్నారులు పలు కీర్తనలకు నృత్యం ప్రదర్శించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన నృత్య ప్రదర్శన ఆద్యంతం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నృత్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందచేశారు.

కౌన్సెలింగ్‌పై ఫిర్యాదులను కమిటీ దృష్టికి తేవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్‌పై ఫిర్యాదులను ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ 22 ప్రకారం ముందుగా జిల్లా స్థాయి కమిటీ అయిన జిల్లా విద్యాశాఖాధికారికి అప్పీల్ చేయాలని ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన పక్షంలో రీజినల్ స్థాయిలో ఆర్జేడీ, అక్కడా సంతృప్తి చెందని పక్షంలో రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు అప్పీల్ చేయాలని ఆయన సూచించారు. ఇతర చట్టపరమైన పరిష్కారాల కోసం వెళ్లే ముందుగా, సంబంధిత ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలలోని అప్పీల్ నిబంధనలను విధిగా పాటించాలని ఆయన తెలిపారు. లేని పక్షంలో ఉపాధ్యాయులపై ఏపీ సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని లింగేశ్వరరెడ్డి హెచ్చరించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 513.40 అడుగుల వద్ద ఉంది. ఇది 137.5158 టీఎంసీలకు సమానం.



బడుల్లో నీటికీ కటకటే

- తాగునీటి కోసం అల్లాడుతున్న విద్యార్థులు
- ఏడాదిగా పనిచేయని ప్లాంట్లు
- పాలకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- కనీసం పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో మూతపడిన ఆర్వో వాటర్ ప్లాంట్లు



రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలోని బడిలో ఆర్వో ప్లాంట్‌కు తాళం వేసిన దృశ్యం

రాజుపాలెం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో సర్కార్ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. విద్యార్థులకు కావల్సిన మౌలిక వసతులను కల్పించారు. రంగురంగులతో కూడిన ఇనుప బెంచీలను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను బడికి పంపాలంటే జంకుతుంటారు. సరైన మరుగుదొడ్లు లేవని, ఆడపిల్లలు బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని తల్లిదండ్రులు అంటుంటారు. కానీ వాటన్నింటికి చెక్ పెడుతూ గత ప్రభుత్వం హయాంలో మరుగుదొడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. వెస్టర్న్ టాయిలెట్స్, వాష్ బేషన్‌లు, అదేవిధంగా ట్యాప్‌లు విద్యార్థులకు అనుకూలంగా ఉండేందుకు అనేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలల్లో ఆడపిల్లల సంఖ్య భారీగా పెరిగింది. మౌలిక సదుపాయాలతోపాటు మినరల్ వాటర్ అందించేందుకు ప్రతి పాఠశాలలో ఆర్వో ప్లాంట్ (వాటర్)ను ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచి ఈ ప్లాంట్‌లు పనిచేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తాగు నీటి కోసం విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఇంటి వద్ద నుంచి బాటిల్స్‌తో నీళ్లు తీసుకెళ్లే దుస్థితి ఏర్పడింది.



చౌటపాపాయపాలెంలో మండల పరిషత్ పాఠశాలలో..

పట్టించుకునే దిక్కే లేదు..

గత ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో రూ.కోట్లు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అవి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పుడు మూలన పడ్డాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలో 46 మండల పరిషత్ ప్రాథమిక , రెండు యూపీ , ఆరు జిల్లా పరిషత్ , ఒక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయి. మండల పరిషత్, యూపీ పాఠశాలలు కలుపుకొని మొత్తం 2,677 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్, కేజీబీవీలలో కలిపి 1,776 మంది చదువుతున్నారు. తొలి దశలో నాడు–నేడు కింద 40 పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థుల సంఖ్యను బట్టి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. మండల పరిషత్ పాఠశాలల్లో రూ.70 వేల నుంచి రూ. 2 లక్షల వరకు, హైస్కూల్‌లలో సుమారు రూ.5 లక్షలతో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. కూటమి సర్కారు వచ్చాక నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఏ ఒక్క బడిలోనూ ప్లాంట్‌లు పనిచేయడం లేదు. ప్రధానోపాధ్యాయులు బాగు చేయిద్దామంటే ఎంత ఖర్చు అవుతుందోనని చేతులెత్తేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్వో ప్లాంట్‌లకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో...

అనుమతి వచ్చాక మరమ్మతులు

కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్‌లు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వాటికి మరమ్మతులు చేపట్టాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి రావాలి. ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన కంపెనీ ప్రతినిధుల దృష్టికి మరమ్మతుల విషయం తీసుకెళ్లినా స్పందన రాలేదు. విద్యాశాఖలోని ఉన్నతాధికారులకు విషయం చెబుతాం. అవసరమైన మరమ్మతులు చేపడతాం. విద్యార్థులకు మంచినీరు అందేలా చర్యలు తీసుకుంటాం. అప్పటివరకు సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు పాటిస్తాం.

– కె.నరసింహారావు, ఎంఈవో–2 , రాజుపాలెం

కూటమి ఏడాది పాలనంతా మోసం



వెన్నుపోటు పుస్తకాని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, వనమా బాలవజ్రబాబు, నూరి ఫాతిమా, దొంతిరెడ్డి వేమారెడ్డి

- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ

నగరంపాలెం: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిందేమీలేదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం 'జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాల్లేవని, అభివృద్ధి జాడలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషలిస్టులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడంతోనే సరిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో పీడీఎఫ్ బియ్యాన్ని విపరీతంగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. మట్టి, ఇసుక, గనులను ఇష్టానుసారంగా కూటమి నేతలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో ఇంటింటికీ మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో బెల్ట్ షాప్‌లు లెక్కలేనన్ని ఉన్నాయని, స్వయానా టీడీపీ నాయకులే బెల్ట్‌షాప్‌లను ప్రకటించుకుంటున్నారని తెలిపారు. బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తే బెల్టు తీస్తామని చంద్రబాబు అంటున్నారని, ఆయన బెల్ట్ తీయరని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించామని గుర్తు చేశారు. ఏడాది చంద్రబాబు మోసపూరిత పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఈనెల 16న 'జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం' పుస్తకాల ఆవిష్కరణలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు నూరి ఫాతిమా (గుంటూరు తూర్పు), దొంతిరెడ్డి వేమారెడ్డి (మంగళగిరి), వనమా బాలవజ్రబాబు (తాడికొండ), పార్టీ నాయకులు నందేటి రాజేష్, వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



చేబ్రోలు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం జరిగింది. చేబ్రోలు మండలం పాతరెడ్డిపాలెంలోని ముట్లూరు రోడ్డులో రేషన్ బియ్యం నిల్వ చేసి, రవాణా చేయడానికి సిద్ధమవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ డి. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆటోలో ఉన్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ధీనం చేసుకొని మస్తాన్‌వలిపై కేసు నమోదు చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు గత కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిసింది. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

డయేరియా నివారణపై అవగాహన కల్పించండి

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి తదితరులు

తెనాలి టౌన్: ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు వచ్చే డయేరియాపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, నివారణ పద్ధతులు తెలియజేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆదివారం ఆయన తెనాలి కార్యాలయంలో డయేరియా నివారణ అవగాహన పోస్టర్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి జులై 31వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్‌లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమర్థంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ అమర్తలూరు శ్రావణ్‌బాబు, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ వేముల ప్రియాంక, అందె బాలచంద్రమౌళి, వి.సీతారామ శాస్త్రి, 104 జిల్లా మేనేజర్ ఎం.రాఘవకుమార్ పాల్గొన్నారు.

వివాహితను రక్షించిన పోలీసులు



కుటుంబ సభ్యులకు యువతిని అప్పగించిన ఎస్ఐ

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను యడ్లపాడు పోలీసులు సకాలంలో స్పందించి కాపాడిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ గ్రామానికి చెందిన సురేష్ ఆదివారం మధ్యాహ్నం సుమారు రెండున్నర గంటల సమయంలో డయల్ 100కు ఫోన్ చేశారు. తన సోదరి వైవాహిక సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసుకోబోతున్నట్లు పేర్కొంటూ, రక్షించాలని కోరారు. సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్ఐ టి. శివరామకృష్ణ వెంటనే అప్రమత్తమయ్యారు. సదరు యువతితో వీడియో కాల్‌లో మాట్లాడి నచ్చజెప్పారు. తాను జీవితంపై విరక్తి చెందానని, ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. పరిస్థితి తీవ్రతను గమనించిన ఎస్ఐ ఆమె మొబైల్ సిగ్నల్స్‌ను ట్రాక్ చేసి యువతి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం తక్కెళ్ళపాడు గ్రామ శివారులో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే కారులో అక్కడికి వెళ్లి ఆమెను బుజ్జగించి ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడకుండా కాపాడారు. తర్వాత పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించి, జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డయల్ 100, అలాగే శక్తి మొబైల్ యాప్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని అత్యవసర సేవలను సమర్థంగా ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. క్షణికావేశంలో జరిగే అనర్థాలను, ప్రమాదాలను వీటి ద్వారా అడ్డుకోవచ్చన్నారు.

వైభవంగా పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు

నెహ్రూనగర్: నగరంపాలెంలోని పునీత ఆంథోని పుణ్యక్షేత్ర 35వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య, నెల్లూరు పీఠాధిపతి బిషప్ రెవరెండ్ పిల్లి ఆంథోని దాస్, గుంటూరు మేత్రాసన విశ్రాంత పీఠాధిపతి బిషప్ రెవరెండ్ డాక్టర్ గాలి బాలి హాజరయ్యారు. ముందుగా పుణ్యక్షేత్ర ఆవరణ నుంచి గుర్రపు బగ్గీపై ఇద్దరు పీఠాధిపతులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యయ్య మాట్లాడుతూ పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి కథోలిక విశ్వాసులు తరలివచ్చి పునీత ఆంథోని అద్భుతాలు పొందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర విచారణ గురువు కొచ్చెర్ల జ్యోతిరాజు, సహాయ గురువు ఎస్. రాజేష్, ఫాదర్లు దాసరి కిరణ్, పి. బాలస్వామి, రేపూడి రాయప్ప, రాజారెడ్డి, సుందరరావు, బాలస్వామి, కమిటీ సభ్యులు ఎస్.జె. ప్రకాశరావు, జొన్నలగడ్డ సుధీర్‌బాబు, వై. సుదర్శన్, దేవస్వామి, శాంతయ్య పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి 'ప్రైవేటు' పిచ్చి పట్టింది

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

లక్ష్మీపురం: మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రైవేటీకరణ పిచ్చి పట్టిందని, అందుకు రాష్ట్రంలో చంద్రబాబు వంతపాడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేటుకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. గుంటూరులో రెండు రోజుల పాటు జరిగిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో నర్సింగరావు మాట్లాడుతూ దేశంలో విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ప్రైవేటీకరణ అన్నారు. రూ.80 లక్షల కోట్ల విలువైన విద్యుత్ రంగం ఆస్తులను అంబానీ, అదానీకి అప్పగించటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. కేంద్రం ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థల ద్వారా అధిక ధరలకు విద్యుత్ కొంటూ, ఆ భారాన్ని ప్రజలపై మోపుతోందని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కును కూడా ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. విమానయానం ప్రైవేటీకరణ వల్లే ఇటీవల ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల నిర్వీర్యం తదితర విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్.రాజేంద్రన్ మాట్లాడుతూ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ప్రమాదంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా అడ్డుకోవాలని నేతలకు సూచించారు. దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని, జేఎల్ఎం గ్రేడ్–2లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22న నెల్లూరులో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పీఆర్సీ ఎరియర్లు ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్ ఆప్షన్లు తిరస్కరించిన ఉద్యోగులందరికీ పెన్షన్ రికవరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మహాసభ తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. క్యూబా సంఘీభావ నిధికి మహాసభ ప్రతినిధులు రూ.12,610 అందించారు.

నూతన కమిటీ ఎన్నిక

యూనియన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.సూరిబాబు, పి.సుదర్శన్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా ఎల్.రాజు, ఉపాధ్యక్షులుగా సీహెచ్. నాగబ్రహ్మచారి, వి.సత్యనారాయణ, జి.వి.శివప్రసాద్, పి.ప్రసాద్, ఆర్.సత్యారావు, జాయింట్ సెక్రెటరీలుగా జాకీర్ హుస్సేన్, డి.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, సీహెచ్. వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కె.కిరణ్‌కుమార్, నాయబ్ రసూలు,పి.శివప్రసాద్‌రెడ్డి, కె.హజరత్తయ్య, మహిళా ప్రతినిధిగా వి.క్రాంతి సహా మొత్తం 39 మందితో కమిటీ ఎన్నికైంది.

వైద్య శాఖలో బదిలీలకు జూమ్ కౌన్సెలింగ్



గుంటూరు మెడికల్: హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వైద్యులు, వైద్య సిబ్బందికి జూన్‌లో జరగబోయే సాధారణ బదిలీలలో పేపర్ కౌన్సెలింగ్‌కు బదులు జూమ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. తమ అభ్యర్థన మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ఆదివారం రాష్ట్ర ,వైద్య ,ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుతో చర్చలు జరిపారని చెప్పారు. పేపర్ కౌన్సెలింగ్‌కు బదులుగా జూమ్ కౌన్సెలింగ్ నిర్వహణకు ఆయన ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇందులో స్టేషన్ సీనియారిటీ ప్రకారం అన్నీ ఖాళీలను ప్రకటించిన తరువాతే కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. జనరల్ ట్రాన్స్‌ఫర్స్‌లో అభ్యర్థులు కోరుకున్న ఐదు ఖాళీలే కాకుండా ప్రదర్శించబడిన ఖాళీల్లో దేన్నైనా కోరుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వానికి తమ సమస్యను వివరించి, పరిష్కరించిన జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావుకు జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, ఏపీఎన్‌జీఓ జిల్లా నేతలు ధన్యవాదాలు తెలిపారు.

ఎండీయూ వాహనాదారుల పాట్లు



ఎండీయూ వాహనం కూరగాయలను తరలిస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం ఒక్క కలం పోటుతో ఎండీయూ వాహనదారులను రోడ్డున పడేసింది. గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరుకులను పంపిణీ చేయడంలో భాగంగా ఎండీయూ వాహనాలు సమకూర్చి డ్రైవర్‌తోపాటు మరో హెల్పర్‌కు జీవనం కల్పించారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లోనే సరుకులు పంపిణీ చేస్తుండడంతో వారంతా రోడ్డున పడ్డారు. కిస్తీలు ఎలా చెల్లించాలో అంతుచిక్కక పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని వైదన గ్రామానికి చెందిన ఎండీయూ వాహన ఆపరేటర్ రైతు పొలంలో పండించిన కూరగాయలను వాహనంలో వేసుకుని బాడుగకు మార్టూరు మార్కెట్‌కు తరలిస్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. – బల్లికురవ

క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో పమిడిపాడు విద్యార్థిని ప్రతిభ


భవిష్యరెడ్డి

బొల్లాపల్లి: జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన పమిడిపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని కొత్త భవిష్యరెడ్డి ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఆల్ఇండియా స్థాయిలో 1649, రాష్ట్రస్థాయిలో 940 ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. విద్యార్థిని భవిష్యరెడ్డిని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఉన్నత చదువులు చదివి పుట్టిన ప్రాంతానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

ప్రయాణికుడిని దోచుకున్న కేసులో ఇద్దరు అరెస్టు

నరసరావుపేట రూరల్: ఓ ప్రయాణికుడిని ఆటోలో ఎక్కించుకొని మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లి అతడిని బెదిరించి అతని వద్దనున్న బంగారం ఉంగరం, రెండు సెల్‌ఫోన్లు, నగదు దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ డి.అశోక్ ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ఈనెల 9వ తేదీ రాత్రి 11గంటల సమయంలో పుల్లబొట్ల శివప్రసాద్ పిడుగురాళ్ల వెళ్లేందుకు పల్నాడు బస్టాండ్‌లో ఎదురుచూస్తుండగా తాము వదిలిపెడతామంటూ బొమ్మిశెట్టి వెంకయ్య, వేముల వెంకటశివ అనే ఇద్దరు వ్యక్తులు కిరాయి మాట్లాడుకొని ఆటో ఎక్కించుకున్నారు. మార్గంలోని రావిపాడు గ్రామం దాటిన తర్వాత పాలపాడు–నల్లగార్లపాడు గ్రామాల మధ్యకు తీసుకెళ్లి అతడిని కొట్టి బెదిరించి అతని వద్దనున్న సొమ్ము కాజేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌కేటీ జంక్షన్‌లో ఇద్దరు నిందితులను అరెస్టుచేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా ‘కోడూరి’


కోడూరి ప్రసాద్‌రెడ్డి

చీరాల అర్బన్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా కోడూరి ప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బీసీల హక్కుల సాధనకు అలుపెరగని పోరు

- అభినందన సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు మనోహర్, పార్థసారథి, సత్యకుమార్‌యాదవ్
- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కృషికి సహకారం అందిస్తాం


కేసన శంకరరావును సత్కరిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

తెనాలి: బలహీనవర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లకు, కులగణన కోసం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రజాక్షేత్రంలో చేస్తున్న పోరాటాలు అభినందనీయమని, ఆయనకు ప్రభుత్వం తరఫున సహకారం ఉంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచారశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కులగణనకు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ అందుకోసం సుదీర్ఘకాలంగా రాష్ట్రం నుంచి ఢిల్లీ వరకు ఉద్యమించిన కేసన శంకరరావు అభినందన సభను ఆదివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఆహ్వాన కమిటీ తరఫున జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. కేంద్ర మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ బలహీన వర్గాల నుంచి వచ్చిన ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయనేతలు తమ మూలాలను మరిచిపోతున్నారనీ, వారు కూడా వ్యవస్థలోనే కలిసిపోతున్నారని అభిప్రాయపడ్డారు. అలాంటప్పుడు రిజర్వేషన్లతో ఎలా ఎదుగుతారనేది సందేహమేనన్నారు. సంక్షేమం, రిజర్వేషన్లు కొంతమేరకు తోడ్పడతాయని చెబుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగిపోతాయని భావించలేమని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ బీసీ నాయకత్వానికి సముచిత స్థానం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బీసీలకు సంక్షేమం, పదవుల విషయంలో చిత్తశుద్ధితో కృషిచేస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార, ప్రజాసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ జనాభాలో 75 శాతంగా ఉన్న దళితులు, బీసీలు పారిశ్రామిక, వ్యాపార, ఉన్నతస్థాయిలోకి రాలేకపోవడంపై చర్చ జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలను సంఘటితపరుస్తూ వారి సమస్యల పరిష్కారానికి హక్కుల సాధనకు జీవితాన్ని అంకితం చేసిన కేసన శంకరరావుకు తగిన గుర్తింపు లభించాల్సి ఉందని, అందుకు తామంతా తోడ్పడతామని హామీనిచ్చారు. వేదాంతం ఫణీంద్ర స్వాగతం పలికిన సభలో తొలుత శంకరరావుపై తీసుకొచ్చిన అభినంద సంచికను మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం శంకరరావును ఘనంగా సత్కరించారు. అఖిల భారత ఓబీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, చిల్లపల్లి శ్రీనివాసరావు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, విన్నకోట వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల బ్రహ్మానందశర్మతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్నుంచి హాజరైన బీసీ సంక్షేమ సంఘం, బీసీ సంఘాల నేతలు, అనుమోలు ఏడుకొండలు, శివరాం బాలాజీ, కోలా అశోక్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమాన్ని ఆహ్వాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెదకూరపాడులో నకిలీ పోలీసుల హల్‌చల్

- ఇసుక ట్రాక్టర్లే లక్ష్యంగా వసూళ్లు
- పోలీసుల అదుపులో నిందితులు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో నకిలీ పోలీసులు దందా వెలుగులోకి వచ్చింది. ఇసుక ట్రాక్టర్లే లక్ష్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. లైసెన్స్, ఆర్సీ చూపించాలని లేదంటే రూ.3వేలు నగదు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14వ తేదీన రాత్రి 8.30 సమయంలో వెలగల నాగరాజు తన ఇసుక ట్రాక్టరుతో కోనూరు నుంచి పెదకూరపాడు మీదుగా సత్తెనపల్లి వెళుతూ పెదకూరపాడు రైల్వేగేటు వద్ద ఆపాడు. ఇంతలో సత్తెనపల్లి మండలం పెద్ద మక్కెన గ్రామానికి చెందిన కంచర్ల పున్నయ్య, రాజధాని ప్రాంతం తుళ్లూరుకు చెందిన చెరుకూరి వరప్రసాద్‌లు ట్రాక్టర్ డ్రైవర్ నాగరాజు వద్దకు వచ్చి మేం పోలీసులమంటూ లైసెన్స్, ఆర్సీ బుక్ చూపించమని బెదిరించారు. లేవని చెప్పడంతో రూ.3వేలు కట్టి వెళ్లమని హెచ్చరించారు. దీంతో భయందోళనకు గురైన డ్రైవర్ నాగరాజు వారితో వాదించి పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించగా పెద్దమక్కెన గ్రామంలో ఓ వివాహానికి తుళ్లూరుకు చెందిన చెరుకూరి వరప్రసాద్ వచ్చి పెద్దమక్కెన గ్రామానికి చెందిన కంచర్ల పున్నయ్యను తోడు తీసుకోని పెదకూరపాడులో వైన్స్‌షాపులో మద్యం తాగి, అనంతరం రోడ్డుపైకి వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరించినట్లు గుర్తించారు. డ్రైవర్ నాగరాజు ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే ఈ ప్రాంతంలో చాలాసార్లు, కొందరు పోలీసుల పేర్లతో, విలేకర్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు.

‘104’ ఉద్యోగులకు సత్వరం జీతాలు చెల్లించాలి


104 ఉద్యోగులతో సమావేశమైన సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో 104 సర్వీసుల్లో ఉద్యోగాలు చేస్తున్న వారందరికీ వెంటనే జీతాలు, బకాయిలు చెల్లించాలని ఏపీ 104 ఎం.ఎం.యు ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ జిల్లా నాయకుడు గుంటూరు విజయకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు డి.కోటిరెడ్డి, ఉపాధ్యక్షులు షేక్ సుభాని మాట్లాడుతూ గత నెల 15వరకు సర్వీసులను అరబిందో యాజమాన్యం నిర్వహించగా, నూతనంగా భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నిర్వహణ చేపట్టిందన్నారు. అయితే గత రెండు మూడు నెలలుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, బకాయిలు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. గత ఐదేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రస్తుత యాజమాన్యంగా వున్నా భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ప్రతీ నెల అన్నీ జిల్లాల్లో గ్రీవెన్స్ మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. కోశాధికారి జిలానీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

19న అన్ని ఆర్టీసీ డిపోలలో కార్మికుల ధర్నాలు

- ఎస్‌డబ్ల్యూఎఫ్ పిలుపు
- 27 విజయవాడలో రాష్ట్ర సదస్సు
- అక్టోబర్ 9, 10 తేదీల్లో తిరుపతిలో రాష్ట్ర మహాసభలు


సమావేశంలో పాల్గొన్న లక్ష్మయ్య, సీహెచ్ నరసింగరావు, కమిటీ సభ్యులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో 10 గంటల పని దినం, మహిళలు రాత్రి షిఫ్టులలో పనిచేయాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న అన్ని డిపోలలో ధర్నాలు, గేట్ మీటింగ్ లు నిర్వహించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని ఆదివారం ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ఆఫీస్ బేరర్ల సమావేశం గౌరవ అధ్యక్షులు షేక్ జిలానీ బాషా, అధ్యక్షులు సీహెచ్ సుందరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి తీర్మానాలను ప్రవేశపెట్టారు. లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లను అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. దీనికి నిరసనగా రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు జూన్ 19వ తేదీన అన్ని డిపోలలో గేట్ మీటింగ్‌లు, ధర్నాలు జరిపి నిరసన తెలియజేయాలని చెప్పారు. కండక్టర్ల ఉద్యోగ భద్రతకు సంబంధించి 1/2019 సర్క్యులర్‌ను యథాతథంగా అమలు చేయాలని, జీవో నెంబర్ 70లోని కార్మిక వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని జూన్ 27న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని వేయాలని, ఉద్యోగులు, కార్మికులకు రావలసిన అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, బకాయిలను ఇవ్వాలని, పీఆర్సీ ఒప్పందం జరిగే లోపు 30 శాతం ఇంటీరియర్ రిలీఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులు వెయ్యాలని, డ్రైవర్, కండక్టర్, మెకానికల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం అన్ని సంఘాలతో చర్చించి, పరిష్కరించాలని కోరారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 9,10 తేదీలలో తిరుపతిలో జరుగుతాయని తెలిపారు. ఆర్టీసీలోని ఎంపిక చేసిన కార్యకర్తలకు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి కేంద్రాలుగా మూడు సెంటర్లలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జూలై నెలలో నిర్వహిస్తామని తెలియజేశారు.

ఫీజుల నియంత్రణపై చర్యలు ఏవీ?

ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీను నాయక్



మాట్లాడుతున్న శ్రీనునాయక్

చిలకలూరిపేట(యడ్లపాడు): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై కూటమి ప్రభుత్వం తక్షణమే కఠిన నియంత్రణలు విధించాలంటూ ఏపీ గిరిజనసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఫీజులపై కొంత నియంత్రణ ఉండేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నేడు పాఠశాలల యజమాన్యాలు విద్యను పూర్తి వ్యాపారంగా మార్చివేశాయని ఆరోపించారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని తెలిపారు. అలాగే విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు తప్పవంటూ హెచ్చరించారు.

22న పూర్వ విప్లవ విద్యార్థి వేదిక సదస్సు


సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నవజ్యోతి, భరద్వాజ, వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న గుంటూరు మెడికల్ కళాశాల ఎదుట ఉన్న ఎన్జీవో కల్యాణ మండపంలో సదస్సు నిర్వహించనున్నట్లు వేదిక నాయకులు నవజ్యోతి, భరద్వాజ తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలో కార్యక్రమ పోస్టర్లు విడుదల చేశారు. భరద్వాజ మాట్లాడుతూ గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో జాతి పోరాటాలు చేస్తున్న విప్లవకారులతో చర్చలు జరిపిన చరిత్ర ఉన్నప్పటికీ, ప్రస్తుతం మావోయిస్టు పార్టీతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని తెలిపారు. కార్పొరేట్ శక్తులు విప్లవకారులను చంపేయాలనే అనే కండిషన్ పెట్టడంతోనే ప్రభుత్వం దాన్ని అమలు చేయడానికి ఈ హత్యాకాండ జరుపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరగాలని పౌర సమాజం నుంచి ఆకాంక్ష బలంగా వ్యక్తమతోందన్నారు. అయితే, దీన్ని ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని చంపేయడమే తమ లక్ష్యమని స్పష్టంగా మాట్లాడుతోందని విమర్శించారు. ఆదివాసీ, గిరిజన ప్రజలపై జరుపుతున్న యుద్ధం గురించి, మావోయిస్టు పార్టీ నాయకులను హత్య చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండ కట్టేందుకు సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఎన్జీవో కల్యాణ మండపంలో జరిగే సదస్సులో విద్యార్థి ఉద్యమం నుంచి విప్లవోద్యమంలోకి వెళ్లిన మావోయిస్టు పార్టీ నాయకులు నంబాల కేశవరావు, లక్ష్మీ వెంకట నరసింహారావు, చలం తదితర విప్లవ నాయకుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీల ప్రాథమిక హక్కులైన జీవించే హక్కు, తాము ఉన్న ప్రాంతంలోని భూమిపై హక్కులను కాలరాసేందుకు వేలాదిమంది పోలీసు, కేంద్ర ప్రభుత్వ దళాలతో భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోందని విమర్శించారు. ఆలోచన పరులు, మేధావులు, ప్రజా సంఘాలు, సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల రూపాయలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, నేడు మాట తప్పడం సిగ్గుచేటని తెలిపారు. 2024–25 సంవత్సరానికి పథకాన్ని బురుడీ కొట్టించి తల్లిదండ్రుల్ని మోసం చేశారని విమర్శించారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి లింకు పెట్టడం సరికాదని తెలిపారు.

క్రికెట్ పోటీల విజేత కావూరు ప్రిన్స్ యూత్ జట్టు


ట్రోఫీతో ప్రిన్స్ యూత్ జట్టు

చిలకలూరిపేట టౌన్: కావూరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. కావూరు–అప్పాపురం మార్గంలో ఈ నెల 3న ప్రారంభమైన ఈ టోర్నీలో జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన 35 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సెమీ ఫైనల్స్‌లో విజేతలైన జట్లు ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కావూరు జట్టు విజేతగా నిలవగా, ఇర్లపాడు జట్టు రన్నర్‌గా సత్తా చాటింది. బసికాపురం జట్టు మూడో స్థానంలోనూ, డేంజర్‌బోయ్స్ లోకల్ కావూరు జట్టు కన్సోలేషన్ బహుమతిని సాధించింది. విజేత కావూరు ప్రిన్స్ యూత్ జట్టుకు రూ. 20,116 నగదు బహుమతిని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యుడు జెగ్రిపోతుల బుల్లిబాబు అందజేయగా, ద్వితీయ స్థానం సాధించిన ఇర్లపాడు జట్టుకు రూ. 15,116 నగదు బహుమతిని విఘ్నేశ్వర పాలకేంద్రం వాసు ప్రదానం చేశారు. మూడో స్థానంలో నిలిచిన విజేతలకు రూ.10,116, కన్సోలేషన్‌కు రూ.7,116 నగదు అందించారు. మాజీ ఏపీజీ దాసరి చిట్టిబాబు మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వహణతో యువతకు శారీరక, మానసిక వికాసంతో పాటు పల్లె ప్రజల మధ్య సత్సంబంధాలు, సామాజిక ఐక్యత మరింత బలపడతాయని తెలిపారు. క్రీడా నిర్వాహకులను ఆయన ప్రశంసించారు.

‘తల్లికి వందనం’లో కోతలు వద్దు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి


మాట్లాడుతున్న రమాదేవి

చీరాల అర్బన్: నిబంధనల పేరుతో తల్లికి వందనానికి కోతలు వద్దని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి కోరారు. సీపీఎం జిల్లా నాయకుల శిక్షణ తరగతులు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. ఆమె మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా తల్లికి వందనం నగదును అర్హులైన విద్యార్థులందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్ పొందిన వారందరికీ నగదు చెల్లించాలని కోరారు. స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. గత ప్రభుత్వం విధించిన షరతులను విమర్శించిన టీడీపీ ప్రస్తుతం అంతకుమించిన షరతులను విధించిందన్నారు. రూ.15 వేలలో రూ.2వేలు మినహాయించారని చెప్పారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఏడాది పాలన సుపరిపాలన అని కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. మోదీ ప్రభుత్వం ప్రజలని భాష, ప్రాంతం పేరుతో విడగొడుతోందని.. రాష్ట్రాలు హక్కులను హరిస్తోందని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా కేంద్రం మోసం చేస్తుంటే ఏడాది పాలనలో కేంద్ర ప్రభుత్వంలో భాగంగా ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నోరు మెదపకుండా మోదీ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కాలేజీలు ప్రయివేటు పరం చేయడం అంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకు రెడ్ కార్పెట్ పరచడమే అని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, ఎన్.బాబూరావు, సీహెచ్ మణిలాల్, జిల్లా కమిటీ సభ్యులు కొండయ్య, టి.వెంకటేశ్వర్లు, ఎం.ఆంజనేయులు, తిరుమల, వసంతరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులపై ఈఓ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ ఆలయ భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్ ఆదేశించారు. పాతపాడులోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానానికి చెందిన పొలాల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ఈవో శీనానాయక్ పరిశీలించారు. సోలార్ ప్లాంట్ విస్తీర్ణం, రోజు వారి ఉత్పత్తి, దేవస్థానానికి వినియోగించే విద్యుత్ తదితర అంశాలను ఆలయ ఏఈ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఈఓ, ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయలేకపోవడానికిగల కారణాలను ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దేవస్థానానికి చెందిన మొత్తం ఐదెకరాల 85 సెంట్ల పొలంలో 1 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈవోకు వివరించారు. ప్రస్తుతం నెలకు 1.20 లక్షల యూనిట్ల ఉత్పత్తి అవుతోందని, ఇంద్రకీలాద్రిపై నెలకు లక్ష యూనిట్ల వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. మిగిలిన 20 వేల యూనిట్లకు సంబంధించి నెట్ మీటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేదంటూ ఇంజినీరింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పరిస్థితి మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

అంతరాలయ దర్శనం రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతూ ఉండటంతో ఉదయం 10గంటల నుంచే అంతరాలయ దర్శనం నిలిపివేయాలని ఆలయ ఈవో శీనానాయక్ సిబ్బందిని ఆదేశించారు. అంతరాలయ దర్శనం నిలిపివేయడంతో భక్తులు రూ.300 టికెట్లు కొనుగోలు చేసి బంగారు వాకిలి దర్శనం చేసుకున్నారు. రద్దీ అధికంగా ఉండటంతో రూ.300తోపాటు రూ.100 టికెటు కొనుగోలు చేసిన భక్తులకు మూడు క్యూలైన్ల ద్వారా త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఈవో తనిఖీలు

భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు ఘాట్‌రోడ్డులోని చెప్పుల స్టాండ్, క్లోక్‌రూమ్, దేవస్థాన బస్సులను తనిఖీ చేశారు. చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద భక్తులు గుంపులు గుంపులుగా నిల్చోవడంతో సెక్యూరిటీ సిబ్బందిని నియమించి క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. ఘాట్‌రోడ్డులో దేవస్థానం ఏర్పాటు చేసిన ఈ టాయిలెట్స్‌కు తాళాలు వేసి ఉండటంతో ఈవో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి నడుచుకుంటూ టోల్‌గేట్ వద్దకు చేరుకుని కొండపైకి వచ్చే వాహనాలను పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ ఉచిత ప్రసాదాలతోపాటు అన్న ప్రసాదం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం రద్దీ కొనసాగింది. రాత్రి 9గంటల వరకు భక్తులు పెద్దఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

